
# మల్లెమొగ్గల గొడుగు

## అంటరానోళ్ళ ఆత్మకథలు

బండ్లూరి సుధాకర్




### సెప్పులు మా కులదేవతలు

సిటికినేలు మీద సిలకలు నిలిపీ
సేసిరి వక జోడొద్దాలు
తెచ్చిరి వక జోడొద్దాలు
ఉద్దాలు దెచ్చిన యెండ్లూరోల్లూ – మాకు
ముద్దుల మాదిగలు

బొట్టినేలు మీద బొమ్మలు నిలిపీ
కుట్టిరి వక జోడొద్దాలు
దెచ్చిరి వక జోడొద్దాలు
ఉద్దాలు దెచ్చిన యెండ్లూరోల్లూ – మాకు
ముద్దుల మాదిగలు

అడ్డనేలు మీద అంసలు నిలిపే
చేసిరి వక జోడొద్దాలు
తెచ్చిరి వక జోడొద్దాలు
ఉద్దాలు దెచ్చిన యెండ్లూరోల్లూ – మాకు
ముద్దుల మాదిగలు

* * * * * *

ఆంధ్రజ్యోతి వారపత్రిక 25.10.96

తాతవూడి ఆనమ్మొదివ బో కమ్మంగ పాటలు బాడతాది. ఆయమ్మ గొంతెత్తి తియ్యంగ పాడతా వుంటే మా యన్నోల్లు బో సంబరంగ ఉద్దాలు కుడతా వుంటరు. ఉద్దాలంటే మీకు దెలియదు గావాల. సెప్పులకే ఆదింగో పేరు. మా శాంతమ్మ యింటెమ్మటే బాలకోటన్న గుడిసుంది.

కోటన్న కిర్రు సెప్పులు గుట్టడంలో సెయ్యి దిరిగిన పనోడు. యేసు ప్రెబువును నమ్ముకు న్నోడు. ముందాయనకి పార్దన సేసుకోని ఆనేక సెప్పులు కుడతడు. ఆసామికి సెప్పులు కుట్టేదానికి అవ్వడు బుట్టకబోతినే అని ఇప్పటికీ కొటకలాడతా వుంటడు. సుట్టగానీ, సారాగానీ ఎడం సేత్తో టైనా ముట్టుకోడు. కడువునిండా సంగటి దిని, గుండెలు మునగ నీల్లుదాగి ఆవూట గడిస్తే సాలు. ఇంగేమీ ఆడగబడ్లే!

కోటన్న కాడికిబోయి కొంచేపు కూసోని రాను పోదామనుకునేవికి ఆయన్నే నన్ను బిలస్తా వుండాడు. "రా, సుదయ్యా! అంటూ నోరార బిలిసి నులకమంచం మీన సినిగిన నల్లదుప్పటేసి కూకోబెట్టినాడు. "యాంది సుదయ్యా! నా పని తనం సూడకుండావే పోతుండవే?" అంటా ఆయన్న పన్రాయి ముందు కూసున్నడు. సుట్టుతా పనిముట్లు ఆయన్న తట్టే సూస్తా వుండాయి.

"యాందనా! శానా పని బెట్టుకోనుండావే" అనడిగినా.

"కిర్రు సెప్పులు గుట్టాల సుదయ్యా! ఆసామి కొడుక్కి పెండ్లి గదా! ఇంగా కుట్లేదని అరస్తా వుండాడు. ఈ పొద్దు యెత్తకబొయ్యి యిచ్చి రావాల. ఇంగ ఆసామే గదూ మనకి మేరబె ట్టేది. కునుకుల్దీస్తే కుదురిద్దా? కుట్టుమానుకుంటే పొట్టనిండిద్దా?

అట్ట మాట్టాడతానే మడతబెట్టిన మెత్తని తోలు తీసి పన్రాయి మీన బెట్టి గూటంతో దబీ దబీ మని కొడతా వొంకులు సరిజేస్తావున్నడు. కాలి ఆది దీసుకోని సిన్నకత్తి దీసుకోని సెరిసమానంగా అట్టలు కోసి పక్కన బెట్టుకున్నేడు. ఉంగటాలు సిద్దం జేసుకోని గూడలు కోస్తావున్నడు. ఆయన్న పన్జేస్తావుంటే ఇంగనాకు సిత్రమనిపిస్తా వుండాది. మోకాటి మీన గెడ్డం ఆనిచ్చి సూపంతా తోలు మినే బరిసి ఎదురార్లు తయారు సేస్తా వుండాడు. మెత్తలు గోసుకోని ఓ తట్టుబెట్టుకున్నడు. నల్లతీగ, తెల్లతీగ, రంగు డబ్బా దెగ్గిర్నే వుండినయ్యి. అట్ట పేళ్లకి యెవకున్న సెల్ల దోకతా వుంటే నేనట్టా సూస్తా వుండినా.

"యాందన్నా! మాట్టాడవూ? ఈ కిర్రు సెప్పుల కిటుకు జెప్పు, కిర్రు కిర్రుమని ఎట్టంటయ్యి" అనన్నా నేను.

గూడలకీ, ఉంగటాలకీ, ఎదురార్లకీ, మడిమ కింది అట్టలకీ నల్లరంగు అద్దతా నా తట్టుజూసి వక నవ్వు నవ్వెండు.

"యేల సమచ్చరాల నుంచీ సంసారులంతా మనం గుట్టిన సెప్పుల తొడుక్కోవటమే గానీ దీని సంగతి యిసారిచ్చి నోల్లుండరా? మనోడివిగాబట్టి మరమం ఆడగతా వుండావు మాదిగోడు ఊసిన సెప్పు లేసుకుంటే కాల్లకి సలవ గదంటయ్యా!

## జోక్స్

"ఏమిట్రా నిమిష – నిమిషానికి వచ్చి బాగున్నావా? అని అడుగుతున్నావు?" అడిగాడు వంశీ.

"అవును మరి, మనదేశంలో ఏవరే జిన నిమిషానికొకడు పోతున్నాడట..." చెప్పాడు సురేష్.

* * *

"డాడీ! 'టెలిఫోన్ బూత్' అంటే అందులో బూతు బొమ్మలుం టాయా?" అడిగాడు కొడుకు.

"అబ్బే, ఆవేమీ వుండవు. పబ్లిక్‌గా టెలిఫోన్‌లో బూతులు మాట్లాడుకుం టారు, అందుకనే ఆ పేరు వచ్చింది" చెప్పాడు తండ్రి.

రచన: పి.వి.మురళీకృష్ణ

హెచ్.ఎం.వి. వారు సగర్వంతో

ఎన్.టి.ఆర్ గారి

ప్రసిద్ధ చిత్ర గీతాలను

కున్నక్కుడి వైద్యనాధన్ గారి

వయొలిన్‌లో

ప్రప్రథమంగా విడుదల

చేయుచున్నారు

ఆనందం పరమానందం




RPG

HMV

CASSETTES AVAILABLE AT ALL MUSIC OUTLETS




పొద్దుగూకులు యాడదిరిగివా ఒల్లు నల్లంగుంటది, సెవ్వ యెంత దూరం వడిసిందో ఈ పెపంచకంలో వొక్క సెప్పలు గుట్టేవోడే సెప్పగలడు. కిర్రు సెవ్వ లగ్గూడా గుండికాయుంటది. నడస్తా వుంటే కిర్రుకిర్రుమని అరస్తా వుంటవి.

సెవ్వ సెడిందంటే దానిగుట్టు మాదిగోడికి తెలుసుద్ది గానీ మా రాజులకి తెలుసుద్దా?"

ఈ రకంగా వాకు సెబతా తెల్లతీగె దీసి వారు గుడతా వుండాడు. కొవ్వు కొమ్ముల్లో నించి ఆరె దించి ముత్యాల గొలుసును సెవ్వకు తాపడం జేసినంత సక్కంగ కుడతా వుంటే ఆ సేతుల పనితవానికి బిత్తరబోతావుండా నేను.

* * * * * *

""యాంది బావా? సద్దికూడు దినవూ!" అంటా మా కోటమ్మొదిన కూటికి బిలస్తా వుంటే మా యన్న పట్టిచ్చుకోడంలా!

"యాందయ్యా! కరకరా యెండమాడ గొడతా వుంటే కడుపులో ఇన్ని వుస్నీల్లు బోసుకోకుంటే ఎట్టా? "సద్దికూడు దిని సంగటెవుడు దినేది?" అంటూ గిన్నిలో వుస్నీల్లు బోసుకొని ఉప్పగల్లు గలిపి గిన్ని మాయన్న కిచ్చింది.

బాలకోటన్న వుస్నీల్లు గటగటా తాగి మీసాలకంటుకున్న మెతుకుల్ని వాలికతో ఎతికబట్టి నవలతా వుండేడు. ఆయన్నకి గంజిమీన కంటే కిర్రుసెప్పల మీనే పావం గుంజతా వుండాది. ఇంగ ఆనంతనే పెద్దకత్తి దీసుకోని అరికాలి అది బెట్టుకోని మారు అట్టలు కోస్తా వాసాయ జూసినాడు.

"సుదయ్యా! ఈ బెమ్మ దేవుడికి మనుసుల్ని చేసేదే దెల్సు గానీ ఆల్లకాల్లకి సెప్పలు గుట్టడం దెలీదు. నువ్వు జెప్ప కాల్లు జేసినోడు గొప్పా? సెప్పలు జేసినోడు గొపా?" అనడిగినాడు.

ఇంగ నేను "ఇద్దురూ గొప్పే గదంటన్నా?" అన్నా

"యాందయ్యా గొప్ప? గొప్పయితే మన కులాన్నెందుకు తప్ప బడతా వుండరు? సేతి సిటికినేలికి బంగారుంగరం జేసేవోడు గొప్ప. కాలి బొట్టనేలికి ఉంగటం జేసేవోడు తక్కువా? నువ్వు జెప్పయ్యా? యాందో డాకటేరు సదివితివంటనే! సాస్త్రం దెలిసినోడివి. కయి గూడా కడతావంటనే? ఈ సంగతి గమక్కో.

సెంద్ర మండలం మీ్మదకి బొయ్యే వోడికీ సెప్పలు గావాల. ముండ్ల తుప్పల్లో దిరిగే వోడికీ సెప్పలు గావాల్సిందే. సెంద్రుడి కాడికి ఎగిరిబొయ్యివోడు ఎంత గొప్పో, నిప్ప దగలకుండా, ముల్లు దగలకుండా ఎన్నెలంత సల్లంగుండే తోలు సెప్పలు కనిపెట్టేవోడు ఎందులో తక్కువా? యేం దీన్ని గురించి యిసారించి వోల్లు వుండరా? యేం మన తాతలు తక్కువోల్లా?

లేత దూడలనించి మిగడ తోలు దీసి కుట్టు కనబడకుండా సెప్పలు గుట్టేవోల్లంట. యేడు మల్లెలెత్తు అన్నట్టు తేలిగ్గా వుంటాయి. పూరవం వోటినే పూలసెప్పలు అనేవోల్లు. వోటిని తూస్తే అయ్యి రెండు తూలాలుండేయి. అనుమంటోల్లు మన తాతలు. అందులోమా యెంద్లూరోల్లు సెప్పలు గుట్టేదాన్లో మా రాజులు. యెంద్లూరోల్లతో సమానంగా అటుమంటి సక్కని సెప్పలు ఇంగెవురూ కుట్టలేక పొయ్యే వోళ్లు. ఈ సంగతులన్నీ నీకు యేసు నాయన జెబుతడ్లే!" అంటా పనికత్తి నూరి అరచేతి మీద పదును జూసుకున్నడు.

"మ్మేయ్! కోటమ్మా! పెనం మీన సెమ్మలు న్నయ్యి గానీ అయ్యి దీస్కరా!" అని మా వొదిన్ని పిలస్తా వుండాడు.

మా వొదిన పెనం దెచ్చి ముందు పెట్టింది. బాలకోటన్న తోలుముక్కల్ని రెండు చేతల్తో కసబిస పిసకతా వుంటే కర్రుకిర్రు సవ్వల్లు యినిపించినయ్యి.

"యాందన్నా బో సిత్రంగ వుందే! తోలు ముక్కల్ని పెనంలో యేసి యాం జేసినవు!" అనడిగినా.

"ఇయ్యి తోలు ముక్కలయ్యా! ఈట్ని సెమ్మలంటరు. పచ్చి తోలుముక్కలు, కొబ్బరి కాయముక్కలు, నిమ్మ సెక్కలు, కొబ్బిరి నమురు అన్నీ కలిపి రోట్లో ఏసి దంచాల. ఒక పూట ఎండలో బెట్టాల. రొవ్వంచేవు పెనం మీన బెట్టి ఏంచితే బాగా బిగుసుకుంటయ్యి. ఈ సెమ్మలు అట్టల మజ్జెలో బెట్టి మట్టనంగ కట్టుకోవాల. ఉంగటాలు బెట్టుకోవాల. జడలు గూడలకి సరిజెయ్యాల. ఎదురార్లు కలుపుకోవాల. సంగవాట్లు ఇత్తడియుంటయ్యి. బంగారు పూతలయుంటయ్యి. ఇంగ రంగురంగుల జలతారు పూతలుంటయ్యి. అయ్యి గూడలకి నైసుగ బెట్టుకోవాల. ఆటిమీన బట్నానులు కొట్టుకోవాల. నల్ల అట్టలకి తెల్లతీగ బెట్టి కుట్టుకుంటే వుంటదయ్యా! సీకటాకాసం మీన తెల్లంగ పాలవుంతలు మెరిసినట్టుంటయ్యి. ఆ అందమే వేరుగా వుంటాది.

"ఇప్పుడు బాటాలొచ్చినంక గూటాలకి పనిలేక పొయ్యా! కంపనీలొచ్చా! కొంప కొల్లేరు జేశె. ఈ పలాస్టిక్కు సెప్పలొచ్చి పేనాలను కాజేస్తుండ్లా! ఆవుపాలు గానీ ఆవుతోలు గానీ ఒంటికి నలవ గదంటయ్యా!" అని కోటన్న సెబతా వుండంగా శాంతమ్మొచ్చింది.

"యాంది బావా? ఈడ కూసున్నవు? కిర్రు సెప్పల కతగానీ రాస్తవా యేంది? నీ పిచ్చి గానీ పట్నపోల్లు మన మోటుసెప్పల్ని తొడుక్కుంటరా! వోల్ల సంగతేమో గానీ మన కుర్రోల్లే కులం పనులు యిడిసిబెట్టి బేల్దారి పనులు జేసుకుంటా వాల్లు డబ్బులొచ్చినాల మంచి యెచ్చలకారితనంగ గుడ్డిబూట్లేసుకోని తిరుగుతుండరు. తోలు సెప్పల మొకమైనా నూస్తుండరా!" అంటా గడగడా మాట్లాడేసి ఎల్లిపొయ్యింది ఆయమ్మి.

అంతలోకి మా బాలకోటన్న సెప్పలు గుట్టేది ముగిచ్చి తయారయిన సెప్పల్ని మురిపంగా వల్లెతోటి తుడుస్తా వున్నడు. నేనా సెప్పల్ని సేతిలోకి దీసుకోని జూస్తా "ఇంత పనితనం జూపిచ్చిన నీ సేతులకి సలాము జేస్తుండా బాల కోటన్నా!" అన్నా.

మా యన్న చిగ్గుపడి బోతా ఇట్టన్నడు. "ఈ సెప్పలు తొడుక్కోని నడస్తావుంటే కర్రుకిర్రుమంటా సెప్పలు కులకతా వుంటయ్యి. సెప్పల గ్గూడా నోరుంటది సుదయ్యా! ఆటి బాస మాదిగోల్లకే తెలును. అందుకే మనకి కూడుబెట్టే సెప్పలు మన కులదేవతలు గదంటయ్యా!"

ఇంగ ఆ మాటలకి నా గుండెకాయ కిర్రు కిర్రుమంటా లోపల గంతులేస్తా వుండింది!"